మంచివాడు

సిగరెట్టు తాగుతూ స్నేహితుడితో కులాసాగా కబుర్లు చెబుతూ విజయవాడ రైల్వే ప్లాట్‌ఫారంమీద నిల్చుని వున్నాడు రామారావు. అతని స్నేహితుడు రంగనాథం మద్రాసు వెళ్తున్నాడు.

వెనకనుంచి భుజంమీద చేయిపడటంతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

బాగా మాసిపోయిన పైజమా లాల్చీలో వున్న వ్యక్తిని చూసి ముఖం చిట్లించుకున్నాడు రామారావు.

"నేను గుర్తున్నానా?" రామం ముఖంలోకి లోతుగా చూస్తూ ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

"లేదు." నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు రామం.

"నా పేరు గోపాలం. ఐదు సంవత్సరాల క్రితం ఇదే ప్లాటుఫారంమీద కలుసుకున్నాం." రామం కళ్ళలోకి గుచ్చి చూశాడు గోపాలం.

రామారావు వెన్నెముకలో ఏదో జరజర పాకినట్లయింది. కళ్ళల్లో భయం, అరచేతుల్లో చెమట్లు పట్టాయి.

"గుర్తులేదా? ఇంకా చెప్పమన్నారా..." అంటూ ఆగి ముఖంలోకి చూశాడు.

రామారావు తడబడుతూ స్నేహితునివైపు చూశాడు అతను అక్కడలేడు. దూరంగా బుక్‌స్టాల్ దగ్గిర నిల్చుని వున్నాడు.

"మీరు పొరబడి వుంటారు. నేను మిమ్మల్ని ఇంతకు ముందెప్పుడూ చూళ్లేదు." తనలో కలిగిన తడబాటును పైకి కనబడనీయకుండా అన్నాడు రామం.

"మీ పేరు రామం కాదూ? మీలో పెద్ద మార్పేమీ లేదు. నాలో చాలా మార్పు వచ్చింది. అందుకే గుర్తించలేదనుకుంటాను."

"కాదు... నా పేరు రామం కాదు... వేంకటేశ్వర్లు" అన్నాడు రామం పాఠం అప్పగించినట్లు.

గోపాలం ఆశ్చర్యంగా రామం కళ్ళల్లోకి చూశాడు. రామం ప్రక్కకు చూడసాగాడు.

"నేనే పొరపడి వుంటాను. మనిషిని పోలిన మనుషులుంటారు." సాలోచనగా అన్నాడు గోపాలం.

"అవునవును. అప్పుడప్పుడు మనం పొరపాటు పడుతుంటాం." కొంత రిలీఫ్‌గా ఫీలవుతూ అన్నాడు రామం.

గోపాలం అదోలా నవ్వాడు. రామం గతుక్కుమన్నాడు.

"బండి రావటానికి చాలా టైం వుంది. కాఫీ తాగుదాం వస్తారా?"

"వద్దు. మీరు తాగండి. ఇప్పుడే నేనూ నా స్నేహితుడూ తాగాం" అన్నాడు రామం.

"మర్యాదకు పిల్చాను. నా దగ్గర డబ్బులుకూడా లేవులెండి . కాఫీ తాగి వస్తాను" అంటూ గోపాలం రెస్టారెంటులోకి వెళ్ళాడు.

అలా వెళ్తున్న గోపాలాన్ని చూస్తూ నిలబడిపోయాడు రామం.

మళ్ళీ వస్తాడేమో? తను వెళ్ళిపోతే? బండి వచ్చేవరకూ వుండకుండా వెళ్ళిపోతే తన స్నేహితుడు ఏమనుకుంటాడో?

అతను తనను గుర్తుపట్టలేదుగా? భయం ఎందుకూ?

ఎలాంటివాడు ఎలా అయిపోయాడు? ఎంత ఉత్సాహంగా కన్పించాడు ఆరోజు? నీట్‌గా డ్రెస్ చేసుకొని వున్నాడు. దుర్వ్యసనాలు వున్నవాళ్ళ గతి ఇంతే!

ఆ రోజు... ఐదేళ్ళనాడు... తను అంతరాత్మ పీకనొక్కి స్మృతిపేటికలో అట్టడుగున గుప్తపరచిన ఆరోజు... మళ్ళీ కళ్ళముందుకొచ్చి నవ్వింది... ...

"ఒరేయ్ రామం! జాగ్రత్తరా! నాలుగువేలు భద్రంగా తీసికెళ్ళి మామయ్యకివ్వు. రైల్లో నిద్రపోకు. అసలే రోజులు బాగా లేవు." హెచ్చరించాడు తండ్రి గుడివాడ బస్‌స్టాండ్‌లో.

రామారావుకు అసలే గుండెలు పీచు పీచుమంటున్నాయి. అంత డబ్బు దగ్గిర పెట్టుకొని ప్రయాణం చెయ్యాలంటే భయంగా వుంది. తండ్రి హెచ్చరికలు మరీ చిరాకు కలిగించాయి.

"సరేలే, ఇక నువ్వెళ్ళు!" విసుక్కున్నాడు రామం.

"వెళ్తాలే, బస్ రానియ్."

రామానికి మహా చిరాగ్గా వుంది.

"రైల్లో జాగ్రత్త..."

"అబ్బబ్బ, ఊరుకో నాన్నా!" అంటూ ఎవరైనా వింటున్నారేమోనని చుట్టూ చూశాడు. ఎవరి గొడవలో వాళ్ళున్నారు, కొద్దిదూరంలో టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకున్న ఒక యువకుడు సిగరెట్టు తాగుతూ రామంకేసి చూశాడు. రామం గతుక్కుమన్నాడు. వాడు తనకేసి ఎందుకు చూస్తున్నట్టు? నాన్న చెప్పడం విన్నాడేమో?

బస్ వచ్చింది. రామం బస్‌ఎక్కి కూర్చున్నాడు. మరోసారి హెచ్చరించి తండ్రి వెళ్ళిపోయాడు. రామం కోటుకిందగా షర్టు మీదనుంచి బనీన్ జేబు తడిమి చూసుకున్నాడు.

బనీన్ జేబులో నాలుగువేలు పెట్టి పిన్ను పెట్టుకున్నాడు. షర్టు మీదనుంచి ఎత్తుగా కన్పిస్తుందనే భయంతో కోటు వేసుకున్నాడు. అయినా భయంగానే వుంది. జేబులు కత్తిరించే వాళ్ళ ప్రావీణ్యత గురించి ఎన్నో కథలు విన్నాడు.

"ఎంతదాకా?"

రామం ఉలిక్కిపడ్డాడు. ప్రక్కకు చూశాడు. తన ప్రక్కన కూర్చున్న వ్యక్తిని చూసి నీరు కారిపోయాడు. వీడు... తనను బస్సుస్టాండ్‌లో గమనిస్తూ నిల్చున్నాడు. ఇప్పుడు పక్కనచేరాడు. తన దగ్గిర పెద్దమొత్తం వున్నట్టు వాసన పట్టినట్టు వున్నాడు. నాన్న మరీ! చుట్టూ వున్న మనుషుల్ని చూడకుండా ఒకటే హెచ్చరికలు చేశాడు.

"మాట్లాడరేం?"

"ఒంగోలు వెళ్ళాలి, హైదరాబాద్-మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో." తీరా నిజం

చెప్పినందుకు తనను తానే తిట్టుకున్నాడు.

"నేను గూడూరు వెళ్ళాలి. ఫర్వాలేదు తోడు దొరికారు. బోర్ కొట్టకుండా కబుర్లు చెప్పుకోవచ్చు" అన్నాడు ఆ వ్యక్తి.

సందేహంలేదు. వీడు తనను వెంబడిస్తున్నాడు. హే భగవాన్! నన్ను ఈ దుర్మార్గుడి బారినుంచి రక్షించే భారం నీదే. అతను మాట్లాడుతూనే వున్నాడు. రామం "ఆం- ఊం" అంటూ యాదాలాపంగా కూర్చున్నాడు.

ఇద్దరూ బస్సు దిగారు.

అతను రిక్షా పిల్చాడు. రామం మరో రిక్షా పిలుస్తూ వుంటే "ఎందుకండీ, రెండు రిక్షాలు దండగ! ఎక్కండి!" అన్నాడు ఆ వ్యక్తి.

రామం గుండెలు కొట్టుకున్నాయి. "జేబు కత్తిరించే ప్రయత్నంలోనే వున్నాడు. దొంగ రాస్కెల్, పైకి ఎంత మర్యాదస్తుడిలా కన్పిస్తున్నాడో!" అనుకుంటూనే రిక్షా ఎక్కాడు.

"మీ పేరు?" రిక్షాలో కూర్చుని అడిగాడు ఆ వ్యక్తి.

"రామం!"

"నా పేరు గోపాలం!" చెప్పాడు అడక్కుండానే.

దొంగలు నిజమైన పేరు చెప్పరు. వీడిపేరు గోపాలం అయి వుండదు. దొంగ వెధవ. దొంగపేరు చెప్పాడు.

"అసలే ఉక్కగా వుంటే ఆ కోటెందుకండి? తీసి పట్టుకోవచ్చుగా?" అన్నాడు గోపాలం.

"అమ్మ రాస్కెల్! జేబు కత్తిరించడానికి కోటు అడ్డంగా వుందా? నాకామాత్రం తెలివితేటలు లేవనుకోకు? నేను చస్తే కోటు విప్పను!" అనుకొని "నాకేం ఉక్కగా లేదు" అన్నాడు రామం.

గోపాలం మెడతిప్పి ప్రక్కన కూర్చునివున్న రామం ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

"ఎట్లా చూస్తున్నాడో వెధవ, తన ప్లానులో పడలేదని!"

ఇద్దరూ రిక్షా దిగారు. రామం రిక్షాకు సగం చార్జీ ఇవ్వబోతే "వుంచండి." వడ్డీతో సహా వసూలు చేసుకుంటాను" అని నవ్వుతూ రిక్షావాడికి డబ్బు ఇచ్చాడు గోపాలం.

రామం శరీరంలో చలి కుదుపు కలిగింది. "వడ్డీతో సహా వసూలు చేసుకుంటా డట! జేబు కొట్టేస్తానని ఎంత ధైర్యంగా చెబుతున్నాడూ?" రామం కోటు కిందగా వున్న బనీన్ జేబు తడిమి చూసుకున్నాడు. చేతికి ఎత్తుగా తగిలి రిలీఫ్‌గా నిట్టూర్చాడు.

కౌంటర్ దగ్గిర ఇద్దరూ నిల్చున్నారు. గోపాలం ముందు నిల్చున్నాడు. టికెట్లుకొని "పదండీ వెళ్దాం!" అన్నాడు.

"టికెట్?'

"నేను కొన్నాను."

"దొంగవేషాలు! నమ్మకం కలిగించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంతోకాలంగా పరిచయం వున్నట్టు కలేసుకుంటున్నాడు. వాడి టక్కరి ఎత్తులు తనకు అర్థం కావడం లేదనుకున్నాడు."

కోటు జేబులో వేరుగా పెట్టిన డబ్బులోనుంచి లెక్కచూసి ఇచ్చేశాడు, గోపాలం

వద్దన్నా వినకుండా.

బండి గంట లేటని తెలిసింది. కనీసం మరో మూడు గంటలయినా స్టేషన్‌లో పడి వుండాలి.

"ఇప్పటినుంచే స్టేషన్‌లో ఏం చేస్తాం? రండి! టీ తాగుదాం" అంటూ గోపాలం స్టేషన్‌కు ఎదురుగా వున్న బార్‌లోకి దారితీశాడు. రామం అయిష్టంగానే అతన్ని అనుసరించాడు.

"ఏం సార్! ఈ మధ్య కన్పించడంలేదు?" గోపాలాన్ని బేరర్ నవ్వుతూ పలకరించాడు.

"అవును, చాలాకాలం అయింది. రెండు టీ స్పెషల్!" అన్నాడు నవ్వుతూ.

రామం ఆలోచనలో పడ్డాడు. ఈ బేరర్‌గాడూ వీడూ కలిసి తనను ఏమైనా చేస్తే? ఇంతమంది మధ్య పబ్లిగ్గా ఏం చేస్తార్లే?

"సిగరెట్ కాలుస్తారా?"

కాల్చాలని వున్నా "వద్దు!" అన్నాడు రామం.

వీడ్నెవరు నమ్మేది! ఆ సిగరెట్‌లో ఏ మత్తు పదార్థమో వున్నా వుండొచ్చు.

బేరర్ టీ తెచ్చి ఇద్దరిముందూ పెట్టాడు.

"స్పెషల్!" అన్నాడు. వాడు నవ్వాడు. కోడ్‌భాషలా వుంది. తన ముందువున్న కప్పులో తప్పక ఏదో కలిపే వుంటాడు. గోపాలం బేరర్‌తో మాట్లాడుతున్నాడు. సమయంచూసి తన కప్పు గోపాలం ముందు పెట్టి రెండోది తను తీసుకున్నాడు.

"తాగండి! స్పెషల్ టీ!" నవ్వుతూ అన్నాడు గోపాలం.

తను కప్పులు మార్చింది గమనించినట్టున్నాడు కాలాంతకుడు.

గోపాలం తన ముందువున్న కప్పు తీసుకొని, టీ తాగుతూ వుంటే రామం ఆశ్చర్యంగా చూశాడు.

"పెళ్ళయిందా?"

"అయింది, ఒక పిల్లవాడుకూడా?" భార్యాబిడ్డల రూపాలు కళ్ళకు కన్పించగా ఉత్సాహంగా అన్నాడు రామం.

"ఉద్యోగం చేస్తున్నారా?"

"లేదు. బి.ఏ పాసయాను. వ్యవసాయం చూసుకుంటున్నాను."

"ఒంగోలు పనిమీద వెళ్తున్నారా?"

"సంతలో ముర్రా బర్రెల్ని కొనడానికి వెళ్తున్నాను" అని చెప్పబోయి మానేశాడు. "పనేంలేదు. మామయ్యకు సుస్తీగా వుంటే చూట్టానికి వెళ్తున్నాను" అన్నాడు.

"మీకు పెళ్ళయిందా?" రామం మొదటిసారిగా ప్రశ్నించాడు గోపాలాన్ని.

"అయింది. ఒక లక్షాధికారి కూతుర్ని లేపుకొచ్చి రిజిష్టర్ మారేజ్ చేసుకున్నాను."

రామం గోపాలం ముఖంలోకి నిరసనగా చూశాడు. ఎంతకైనా తెగించినవాడే అనుకున్నాడు.

"నేను బ్యాంక్‌లో పని చేస్తున్నాను."

"కొయ్ రా నాయనా కొయ్! అడక్కుండానే బ్యాంకులో ఉద్యోగం అని చెప్తున్నాడు. తను ఇలాంటి వేలు ఎన్నో రోజుకు చూస్తాననీ, డబ్బంటే తనకు లక్ష్యం లేదనీ తనను

ఇంప్రెస్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు చిట్టినాయన! తనకు బొత్తిగా బుర్ర లేదనుకుంటున్నాడు!"

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

రామం తృళ్ళిపడ్డాడు. చేతిలో వున్న కప్పులో టీ వొలికింది. చెయ్యి చురుక్కుమంది.

"చెమట్లు కారిపోతున్నా ఆ కోటు విప్పరేం? మిమ్మల్ని చూస్తుంటే నాకు బాధగా వుంది." గోపాలం అన్నాడు.

"వుంటుంది! వుంటుంది! ఎందుకుండదూ బాధగా? నీకు కావలసింది నేను వేసిన కోటు విప్పడమేగా? నేను ఆ మాత్రం గ్రహించలేదు అనుకోకు" అనుకున్నాడు. పైకి సమాధానం ఇవ్వలేదు.

"మీకు డ్రింకు తీసుకునే అలవాటుందా?"

"అమ్మబిడ్డా! తాగించాలని చూస్తున్నావా?"

తాగాలని వున్నా "లేదు, నాకు అలవాటు లేదు." అబద్ధం ఆడేశాడు రామం.

"మీరు చాలా బుద్ధిమంతుడిలా వున్నారు?"

"నాకు చెడు అలవాట్లేమీ లేవు." గర్వంగా అన్నాడు రామం.

"నాకు అన్ని చెడు అలవాట్లూ వున్నాయ్. తాగుతాను, అందుబాటులో వున్న ఆడవాళ్ళను వదిలిపెట్టను. నా భార్య పరాయి మగవాడితో తిరుగుతానంటే చస్తే ఒప్పుకోను. మీలా మంచి అలవాట్లతో మనిషి ఎలా జీవిస్తాడో నాకు తెలియదు. గతాన్ని తల్చుకుంటూ, భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ బతకలేను. వర్తమానంలో జీవిస్తాను. ప్రతిక్షణం జీవిస్తాను." విస్కీ గ్లాసు ఖాళీ చేశాడు.

రెండో గ్లాసుకూడా పూర్తి కావస్తోంది. కబుర్లు చెపుతూ, మధ్య మధ్య కూనిరాగం తీస్తూ త్రాగుతున్నాడు.

ఏవిటి? అంత తాగేస్తున్నాడు? అంత డబ్బు అతని దగ్గర వుందా?

గోపాలం ముఖంలోకి చూశాడు. కళ్లు మత్తుగా వాలిపోతున్నాయ్. ముఖం ఎర్రబడింది.

"ఇదీ ఒకందుకు మంచిదే? మరో గ్లాసు కొట్టేడంటే గుర్రం ఎక్కేస్తాడు. ఇక వాడి బొంద, వాడు నన్నేం చేస్తాడు?" ఆలోచనలో పడ్డాడు రామం.

"నా... నా... భార్య... చాలా... మంచిది. నా కోసం కులం... ధనం అన్నీ వదిలేసుకుంది. నేనేం చేసినా సహిస్తుంది..."

అబ్బాయిగారి పని సగం అయిపోయింది. "మరో గ్లాసు తాగుతారా? డబ్బుకు వెనుకాడకండి, నా దగ్గర వుంది, ఇస్తాను" అన్నాడు రామం ఉత్సాహంగా.

గోపాలం రామం ముఖంలోకి చూశాడు.

"డబ్బు నా దగ్గరకూడా వుంది. మూడువేలకు పైనే ఉంది. ఇంత మొత్తం దగ్గిర పెట్టుకుని ఇవాళ తాగకూడదనే అనుకున్నాను. కాని ఉండలేకపోయాను. ఇందులో వున్న హాయి మీకు అర్థంకాదు. మీలాంటివాళ్ళను చూస్తుంటే నాకు జాలి వేస్తుంది. తాగడంవల్ల కొన్ని నష్టాలు లేకపోలేదు. అప్పుడప్పుడు వాచీ, పెన్, డబ్బూ పోతూ వుంటాయ్." అన్నాడు గోపాలం మూతలు పడిపోతున్న కళ్ళను బలవంతంగా తెరుస్తూ.

"వీడు మామూలు దొంగకాడు. గజదొంగ. తెలివైన దొంగ. తన దగ్గిర

మూడువేలున్నట్టు నన్ను నమ్మించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఒరేయ్ రాస్కెల్! నువ్వు తాగినా తెలివిగానే వున్నావురా! నాకూ వున్నదిరా తెలివి. పైగా తాగలేదుకూడా!" కసిగా అనుకున్నాడు రామం.

బేరర్ బిల్లు తెచ్చాడు. గోపాలం పర్సుతీసి వందరూపాయల నోటు ఇచ్చాడు.

మొత్తంమీద ఒక వంద రూపాయల నోటు వున్నట్టుంది. అది ఎవరి జేబులోనుంచి కొట్టేశాడో!

బేరర్‌కు ఐదురూపాయలు ఇచ్చి గోపాలం లేచి నిల్చున్నాడు. తూలి కుర్చీ పట్టుకున్నాడు.

"రామంగారూ! ఈ పర్సు మీ దగ్గిర వుంచండి. ఇందులో చాలా డబ్బు వుంది. నేను మత్తులో వున్నాను. వళ్ళు తెలియకుండా నిద్రపోతే ఎవరైనా తీసేస్తారు" అంటూ పర్సు అందించాడు.

రామం పర్సు అందుకున్నాడు. పర్సు లావుగానే వుంది.

ఓ క్షణం రామానికి అతని మాటల్లో నిజాయితీ వున్నట్టు అనిపించింది.

అంతా దొంగ వేషం! తను ఆ పర్సు ఎక్కడ పెడతాడో చూడాలనే ప్రయత్నం తన జేబుల రహస్యం తెలుసుకోవడానికే ఈ ఎత్తు వేశాడు. తను మాత్రం తక్కువ తిన్నాడా ఏం? దీన్ని కోటు జేబులోనే పెట్టుకుంటాడు. తనకు వేరే జేబులే లేనట్టు ప్రవర్తిస్తాడు. అయినా వాడి బొంద, ఇందులో ఏముంటుంది గనుక? ఏవో పిచ్చి కాగితాలూ బిల్లులూ వుండి వుంటాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీరు ఒంగోలులో దిగిపోయేముందు నన్ను లేపి ఇచ్చేయండి" అన్నాడు గోపాలం.

రామం పర్సు కోటు జేబులో పెట్టుకున్నాడు.

"జాగ్రత్త! కోటు జేబులో పెట్టుకున్నారు. షర్ట్ జేబు లేదా?" గోపాలం అడిగాడు.

"చిక్కావురా బిడ్డా! నేను ముందే అనుకున్నాను. నువ్వు నా జేబుల రహస్యం తెలుసుకోవడానికే ఈ పర్సు నాకిచ్చావని" అనుకుంటూ "నా షర్టుకు జేబులేదండీ!" అన్నాడు. ఆ విషయం చెప్పే అవకాశం వచ్చినందుకు రామానికి సంతృప్తిగా వుంది. నిశ్చింతగా ఉంది.

గోపాలం తడబడుతూనే ప్లాట్‌ఫారం చేరాడు. రామం భుజంమీద చెయ్యివేసి రైలు పెట్టెలోకి ఎక్కాడు.

బండి బయలుదేరింది. సీట్లు చాలావరకు ఖాళీగానే వున్నాయ్. గోపాలం ఇద్దరు మనుషులు కూర్చోగల స్థలంలో ముడుచుకుని పడుకున్నాడు.

రామానికి పర్సులో ఎంతవుందో చూడాలనే కుతూహలం కలిగింది. బాత్‌రూంలోకి వెళ్ళి నోట్లు లెక్కపెట్టేడు. రామం ఆశ్చర్యానికి అంతులేదు. మూడువేలు వున్నాయ్. హోటల్లో మార్చిన వంద రూపాయల్లో మిగిలిన కొన్ని పది రూపాయల నోట్లుకూడా వున్నాయ్.

రామం తిరిగి సీటు దగ్గరకు వచ్చాడు. గోపాలం మంచి నిద్రలో వున్నాడు. నిద్ర నటిస్తున్నాడేమోననే అనుమానంతో ముఖంలోకి పరీక్షగా చూశాడు.

ఆ ముఖం ఎంతో అమాయకంగా కన్పించింది.

చిన్నపిల్లవాడిలా ఇంత నిశ్చింతగా నిద్రపోతున్న ఇతను దొంగా! కాదు. కాదు...

తనే అనవసరంగా భయపడ్డాడు. అతన్ని అనుమానించాడు.

అయినా రామం తెల్లవార్లూ కూర్చునే వున్నాడు. తెలతెలవారుతుండగా ఒంగోలు స్టేషన్ వచ్చింది.

రామం లేచి నిల్చున్నాడు. బ్యాగ్ తీసుకున్నాడు. ఓ క్షణం హాయిగా నిద్రపోతున్న గోపాలం ముఖంలోకి చూసి దిగిపోయాడు.

"ఆగు!" ప్లాట్‌ఫారంమీద నడుస్తున్న రామం ఉలిక్కిపడి ఆగాడు.

తననుకాదు. అరే అతని పర్సు తన దగ్గిరే వుండిపోయిందే? తను మర్చేపోయాడు. బండి ఆగి వుంది. వెళ్ళి ఇచ్చేస్తే? తను బండి ఎక్కగానే అది కదిల్తే? పోనీయి తర్వాత పంపించవచ్చులే. స్టేషన్ బయటికి నడిచాడు. బండి బయలుదేరింది. చూస్తూ నిల్చున్నాడు.

అతని అడ్రసు తన దగ్గిర లేదుగా? ఎలా పంపించడం? అతను తనని గురించి ఏమనుకుంటాడు? దొంగ అనుకుంటాడేమో? అనుకోనియ్! తను నిజంగా దొంగతనం చేశాడా ఏమన్నానా? మర్చిపోయాడు! అంతేగా? మనియార్డరు ద్వారా పంపాలంటే అతని అడ్రసు లేదాయె.

"అబద్ధం! నువ్వు మర్చిపోలేదు. కావాలనే దిగేశావ్.

"నువ్వు దొంగవు. ఘరానా దొంగవు!" లోపల ఏదో అరిచింది.

"ఏయ్ నువ్వు నోర్ముయ్! నేనేం కావాలని మర్చిపోలేదు. నిజంగా నేను మర్చిపోయాను. ఇందులో దొంగతనం ఏముంది? అతనిమీద నాకూ జాలిగానే వుంది. ఇలా జరిగినందుకు బాధగానే వుంది."

బస్‌మని తల ఎత్తిన అంతరాత్మ నెత్తిమీద ఒకటివేసి దాన్ని పడుకోబెట్టాడు రామం.

✿ ✿ ✿

మళ్ళీ చివ్వున అంతరాత్మ తలఎత్తి "ఏం? ఆరోజు నన్ను కసిరికొట్టావుగా? నిజంగా మర్చిపోతే ఆ డబ్బు ఇప్పుడు ఇచ్చెయ్!" గట్టిగా అరిచింది!

దీని సిగతరగ ఇదొకటి మధ్యలో– మాటకు ముందు నేను వున్నానంటూ బయలు దేరుతుంది.

"ఏడ్చావ్‌లే నోరు మూసుకో! ఇప్పుడు నా దగ్గిర అంత డబ్బు ఎక్కడుంది?"

"ఇప్పుడు లేకపోతేనేం? అతన్ని ఇంటికి తీసుకెళ్ళు. రేపు సర్దు."

"మంచిదానివే! దొంగవేషం వాడూనూ! పక్కా దొంగలా కన్పిస్తున్నాడు."

"నీకంటేనా?"

"నువ్వు నోరుమూస్తావా లేదా?"

చెవులు గింగురుమనేలా నవ్వింది అంతరాత్మ.

"ఏమిటా పిచ్చినవ్వు?"

"దొంగ మంచివాణ్ణి దొంగ అంటుంటేను..." మళ్ళీ నవ్వు.

"నేను దొంగనా? వాడు మంచివాడా? ఎవరైనా వింటే నవ్విపోతారు."

"అవును. లోకం దృష్టిలో నువ్వు మంచివాడివే. నీకు చాలా మంచిపేరు వుంది. పరస్త్రీలను కన్నెత్తి (దొంగ చూపులు తప్ప) చూడవు. పదిమందిలో (రహస్యంగా తప్ప) తాగవు. చాలా మంచివాడివి. ఎవరూ తెలుసుకోలేరనుకుంటేతప్ప దొంగతనం, రంకుతనం చెయ్యవు.'

"నువ్వు నోరు మూసుకుంటావా లేక గొంతు పిసకమంటావా?"

"నా గొంతు వదిలెయ్! ఊపిరాడటం లేదు. నా కెందుకులే. నీ ఇష్టం వచ్చినట్టే చెయ్!"

"అలారా దారికి! మాటకుముందు నేనున్నానంటూ బయలుదేరకు. జాగ్రత్త!"

"ఏరా రామం! ఒంట్లో బాగా లేదా? ఒళ్ళంతా చెమట్లు పట్టిందేం?" రామం స్నేహితుడు ప్రశ్నించాడు.

రామం తృళ్ళిపడ్డాడు. "ఏదోరా కొంచెం గిడ్డీగా వుంది" అంటూ కర్చీఫుతో ముఖం తుడుచుకోసాగాడు.

"వీరేనా మీ స్నేహితులు, మద్రాసు వెళుతుంది?"

"మళ్ళీ తగలడ్డావ్?" అనుకున్నాడు రామం. "అవుసు" అని సమాధానం చెప్పాడు.

"ఇతనెవరు?" పైనుంచి కిందకు శల్యపరీక్ష చేస్తూ అడిగాడు రామం స్నేహితుడు.

"నా పేరు గోపాలం. ఒకప్పుడు బ్యాంకులో పనిచేసేవాణ్ని."

"మరి ఇప్పుడో?" రామం స్నేహితుడు అడిగాడు.

"నా వేషం కన్పించడంలా! ఇప్పుడు నిరుద్యోగిని. ఉద్యోగం పోయింది."

"ఏం, ఏం చేశావ్?"

ఏకవచన ప్రయోగానికి ఆశ్చర్యపోతూ ఓ నిముషం అతని ముఖంలోకి చూశాడు గోపాలం.

'క్యాష్ మూడువేలు పోయింది. ఇక్కడే, ఈ విజయవాడనుంచి ఇదే బండికోసం ఎదురుచూస్తూ పోగొట్టుకున్నాను. ఆరోజే ఇన్‌స్పెక్షన్ జరిగింది. వేరే డబ్బు తెచ్చిపెట్టే సమయంకూడా లేకపోయింది. మా బాస్ నోరు పారేసుకున్నాడు. కోపంతో నాలుగు తగిలించాను. ఉద్యోగం పోయింది. జైలుకుకూడా వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పటికి నా భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దొంగతో కాపురం చెయ్యనని డైవోర్సుకు కోర్టుకు వెళ్ళింది." నవ్వుతూ చెప్పాడు గోపాలం.

రామం ముఖంలోకి చూశాడు.

"మీకు ఒంట్లో బాగా లేనట్లుంది. కాసేపు కూర్చోండి" అన్నాడు గోపాలం.

"అబ్బే! నాకేంలేదు, బాగానే వున్నాను." నంగి నంగిగా అన్నాడు రామం.

"ఇంకా నయమే, అతను నన్ను గుర్తుపట్టలేదు. గుర్తుపడితే ఏం చేసేవాడో?" రామం లోలోపల వణికిపోతున్నాడు.

బండి వచ్చింది. రామం స్నేహితుడు ఎక్కాడు. బండి కదలబోయేముందు రామం భుజంమీద చెయ్యివేసి "వస్తానండి రామంగారూ!" అన్నాడు గోపాలం.

రామం అదిరిపడి గోపాలం ముఖంలోకి చూశాడు. గోపాలం కదుల్తున్న బండి ఎక్కి, డోర్ దగ్గిర నిలబడి నవ్వుతూ చెయ్యి ఊపాడు.

రామం అప్రయత్నంగా రెండుచేతులూ జోడించి నమస్కరించాడు.

(1969 ఆంధ్ర సచిత్ర వారపత్రిక)